
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY




5 జనగామ

గురువారం 26 సెప్టెంబరు 2024

మహానగరంలో భూ మాయగాళ్లు చెలరేగిపోతున్నారు. వరంగల్ ట్రై సిటీస్‌లో సర్కారు జాగా ఖాళీగా కనిపిస్తే చాలు ఫెన్సింగ్ వేసి చుట్టేస్తున్నారు. పొరుగు భూముల సర్వే నెంబర్లతో రూ.కోట్ల విలువైన సర్కారు భూములకు ఎసరు పెడుతున్నారు. అక్రమ నిర్మాణాలతో పర్మినెంట్‌గా సెటిల్ అయిపోతున్నారు. కొన్నాళ్లుగా హనుమకొండ హంటర్ రోడ్డులోని పులిగుట్ట (టైగర్ హిల్స్)పై ఏర్పాటు చేసిన సైన్స్ సెంటర్‌తో పాటు సుమారు 10ఎకరాల ప్రభుత్వ భూముల్లో అక్రమార్కులు పాగా వేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యేలు, వారి అనుచరులు, తాజా, మాజీ కార్పొరేటర్లు, అధికార పార్టీ నేతలతో పాటు చోటామోటా నేతలు గుట్టలను తవ్వేస్తూ.. ఖాళీస్థలాల్లో దర్జాగా తిష్టవేస్తున్నారు. అడుగు ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైతేనే ఆగమాగమయ్యే అధికారులు పులిగుట్ట ప్రాంతంలో సుమారు రూ.200కోట్లకు పైగా విలువైన భూములు కబ్జా అవుతుంటే చోద్యం చూస్తున్నారా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

ఆక్రమణకు గురవుతున్న హనుమకొండలోని పులిగుట్ట



- మాజీ ఎమ్మెల్యేలతో పాటు పలువురు కీలక నేతలు, తాజా, మాజీ కార్పొరేటర్ల హస్తం
- హంటర్‌రోడ్డులోని సర్వే నెంబరు 964, 966లో 49ఎకరాల ప్రభుత్వ భూమి
- 2015లో టైగర్స్‌హిల్స్‌పై 15ఎకరాల్లో సైన్స్ సెంటర్ ఏర్పాటు
- ఆ కేంద్రంతో పాటు పదెకరాలకుపైగా సర్కారు స్థలాల అన్యాక్రాంతం
- పక్క సర్వే నెంబరుతో అక్రమ రిజిస్ట్రేషన్లు.. దర్జాగా అక్రమ నిర్మాణాలు
- పులిగుట్ట పరిసర ప్రాంతాల భూములపై సర్వే చేస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి..

సైన్స్ సెంటర్ భూములు స్వాహా!




సర్వే నెం.964లో అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు (ఫైల్)

కబ్జాకోరల్లో 200కోట్ల విలువైన పదెకరాలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఉమ్మడి ఓరుగల్లు విద్యార్థులు మరింత అభ్యున్నతి సాధించాలన్న లక్ష్యంతో 2015లో హంటర్‌రోడ్డులోని పులిగుట్ట (టైగర్ హిల్స్)పై 15ఎకరాల్లో తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(టీజీసీఎస్‌టీ)ని ఏర్పాటు చేశారు. నాడు విద్యాశాఖ మంత్రిగా ఉన్న కడియం శ్రీహరి ఈ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ రీజనల్ సైన్స్ సెంటర్‌లో 69సైన్స్ ఎగ్జిబిషన్స్‌తో పాటు ఫిజిక్స్, బయోలజీ, కెమిస్ట్రీ, మ్యాథ్స్, ఎన్విరాన్‌మెంట్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించేలా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందు కోసం గతంలోనే ప్రభుత్వం రూ.6కోట్లు వెచ్చించింది. తాజాగా మరో రూ.4కోట్లతో సైన్స్ సెంటర్ అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పనులు ప్రారంభించారు. నగరం నడిబొడ్డులో ఉండ టంతో పాటు వేలాది మంది విద్యార్థులకు ఉపయో గపడే టైగర్స్‌హిల్స్ గుట్టల భూములపై కబ్జాకోరుల కన్ను పడింది. వందల కోట్ల రూపాయల విలువ చేసే భూములను కొల్లకొడుతున్నారు.



రికార్డుల్లో సర్వే నెం.964, 966లో ప్రభుత్వ భూమిగా నమోదు

రూ.200కోట్ల విలువైన భూములు స్వాహా?

వరంగల్ మహానగరం రోజురోజుకు విస్తరిస్తోంది. దీంతో భూముల ధరలకు రెక్కలొస్తున్నాయి. ఈ నేప థ్యంలో అక్రమార్కులు ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములపై కన్నేస్తూ దర్జాగా కబ్జా చేస్తున్నారు. హనుమకొండ పట్టణంలోని హంటర్‌రోడ్డులో వన విజ్ఞాన కేంద్రం, రీజనల్ సైన్స్ సెంటర్‌తో పద్మాక్షి గుడి, సిద్ధేశ్వరస్వామి ఆలయం, జూ పార్కులు ఉన్నాయి. దీంతో ఈ ప్రాంతం కమర్షియల్‌గా అభివృద్ధి చెం దుతోంది. ఈ ఏరియాలో హనుమకొండ గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 964లో 44.37 ఎకరాలు, సర్వే నెంబరు 966లో 4.03ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. రెండు సర్వే నెంబర్లలో మొత్తం 49ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. వీటిలో రీజనల్ సైన్స్ సెంటర్ కోసం 2015లో ప్రభుత్వం 14.20ఎకరాల భూమిని కేటాయించింది. సర్వే నెంబర్లు 964, 966లో మొత్తం 49ఎకరాల్లో సైన్స్ సెంటర్‌కు 14.20 ఎకరాల భూమిని కేటాయించగా, మిగిలిన భూమిలో 127 అక్రమ కట్టడాలు నిర్మించి నట్టు గుర్తించారు. వీటికి కార్పొరేషన్ అధికారులు ఇంటి నెంబర్లు కేటాయించటంతో పాటు ఇంటి పన్ను, నల్లాపన్నులు కూడా వసూళ్ల చేస్తుండటం చర్చనీయాంశంగా మారింది. అలాగే మిగిలిన భూ మికి ఎలాంటి హద్దులు లేకుండా అధికారులు వది లేశారు. ఇందులో శిల్పారామం, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ విలేజ్ ఏర్పాటు చేయాలని గతంలో తహసీల్దార్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అయితే అవి అమలుకు నోచుకోలేదు. కాలక్రమేణా హంటర్ రోడ్డు అభివృద్ధి చెందుతుండటంతో కబ్జారా యుళ్ల కళ్లు టైగర్ హిల్స్‌పై పడింది. గత ప్రభుత్వ హ యంలో కీలక నేతలు ఆదేశాలతోనే వారి అను చరులు హంటర్‌రోడ్డులో ఉన్న ఖాళీగా కనిపిస్తున్న గుట్టతో పాటు చెట్లను, పొదలను తన ఎక్స్‌కవేటర్ యంత్రాలతో ఓ నేత చదును చేసి దర్జాగా కబ్జా చేశారనే ప్రచారం జరుగుతోంది. పక్కనే ఇతర స ర్వే నెంబర్లలో భూములు

మిగతా 6వ పేజీలో..

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

- వరంగల్ ఎంపీ కడియం కావ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కడియం కావ్య

జనగామ కల్చరల్, సెప్టెంబరు 25: మహిళా శక్తి పథకంతో మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. బుధవారం చాకలి ఐలమ్మ జిల్లా మహిళా సమాఖ్య 8వ వార్షిక మహాసభను జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కావ్య హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. ప్రతి మహిళ ఒక వ్యాపారవేత్త కావాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ సమాజంలో తోటి మహిళకు ఆదర్శంగా నిలవాలని అన్నారు. మహిళలను సంఘటితపరిచి ఆర్థిక పురోగతి సాధించడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొని మహిళా శక్తి పథకాన్ని ప్రవేశపెట్టి మైక్రో ఎంటర్‌ప్రైజెస్ ద్వారా విభిన్న యూనిట్లను అందిస్తున్నదని, అన్ని రంగాలలో మహిళలు రాణించి ప్రగతి పథంలో దూసుకుపోవాలన్నారు.

కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ డిమాండ్ ఉన్న ఉత్పత్తులనే చేపట్టి మహిళలు ఆదాయం గడించాలన్నారు. ఇప్పటి వరకు మహిళలు వివిధ రంగాలలో రాణిస్తూ జిల్లాలో అభివృద్ధి పథంలో కొనసాగుతూ సాధికారత సాధిస్తున్నారన్నారు. మహిళా సభ్యులందరూ రుణాలు పొందేలా అధికారులు, మహిళా సంఘ సభ్యులు కృషి చేయాలన్నారు. రుణాల రికవరీ పెరిగిందనీ, భవిష్యత్తులో రికవరీ అనే పదం ఉండరాదన్నారు. రూ.2లక్షల రుణాలు పొందే మహిళలు రూ.5లక్షల రుణాలు పొందేందుకు, రూ.5లక్షల రుణాలు పొందేవారు రూ.10లక్షలు పొందే విధంగా ముందుకు రావాలన్నారు. జిల్లాలోని మహిళా సంఘాలు, పాఠశాల విద్యార్థుల యూనిఫామ్ కుట్టించే పనులు చేపట్టి విజయవంతంగా పూర్తి చేశారన్నారు. అనంతరం డీఆర్‌డీవో, అధికారులు అతిథులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్, డీఆర్‌డీవో వసంత, జడ్పీ సీఈవో సరిత, జిల్లా అధికారులు, జిల్లా సమాఖ్య అధ్యక్షులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య నివారణే ధ్యేయం

- మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ లలిత



పైపులైన్ల మరమ్మతు, నల్లాల ఫిట్టింగ్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 25: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా వాటి నివారణే తమ ధ్యేయమని మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్(సీఈ) లలిత తెలిపారు. భవిష్యత్తులో గ్రామాల వారీగా తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా మండలంలోని 18 గ్రామాలకు చెందిన వాటర్‌మన్‌లకు వివిధ అంశాలపై చేపట్టిన నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సీఈ బుధవారం సందర్శించారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో మొదటి రోజు పైపులైన్ల ఏర్పాటు, ట్యాప్‌ల మరమ్మతుపై వాటర్‌మన్లకు థియరిటికల్‌గా, ప్రాక్టికల్‌గా శిక్షణను సంబంధిత అధికారుల ఆధ్వర్యంలో అందించగా సీఈ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీటి సరఫరా నిర్వహణలో చేపట్టాల్సిన అంశాలపై కార్మికులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ట్యాప్‌లను ఎలా ఏర్పాటు చేయాలి, పీవీసీ పైపుల అనుసంధానం, పైపులకు ఎలా మరమ్మతులు చేయాలి, పైపులు పగిలితే ఎలా రిప్లేస్ చేయాలనే అంశాలపై పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వాటర్ ట్యాంకులలో క్లోరిన్ శాతంను పరిశీలించి తక్కువగా ఉంటే ఎలా కలపాలని శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కొందరు కార్మికులకు మరమ్మతులపై పూర్తి స్థాయిలో అవగాహన లేకపోవడంతో తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని, వాటి నివారణ కోసమే శిక్షణను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్మికులు విధిగా నాలుగు రోజుల శిక్షణలో పాల్గొని అన్ని విషయాలు తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఈ క్రిష్టయ్య, ఈఈలు రాజయ్య, శ్రీకాంత్, డీఈ కరణ్‌కుమార్, ఏఈ సుకన్య, కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథంతో సర్వే చేపట్టాలి

- జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి నరసింహారావు



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహారావు

దేవరుప్పుల, సెప్టెంబరు 25: పిల్లల భావి జీవితాన్ని మెరుగుపర్చేందుకు దోహదపడే ఈ సర్వే ఉద్యోగ ధర్మంగానే కాకుండా సేవా దృక్పథంతో చేపట్టాలని జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి నరసింహారావు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించడానికి ప్రశస్త్ కార్యక్రమం ద్వారా చేపట్టే సర్వే గురించి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు మూడు రోజులుగా మండలంలోని కామారెడ్డిగూడెం హైస్కూల్‌లో శిక్షణ ఇస్తున్నారు. మొబైల్ యాప్ ద్వారా నమోదును, విద్యార్థుల స్థితిగతులను గుర్తించి నమోదు చేయటానికి చేపట్టవలసిన కార్యక్రమాలపై అవగాహన జరుగుతుండగా ముగింపు రోజున బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ దేశ జనాభాలో 2.5 శాతం దివ్యాంగులు ఉండవచ్చని పలు సర్వేలు నివేదించాయన్నారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం తొలుత విద్యార్థుల స్థితిగతులను తెలుసుకొని ఒకవేళ దివ్యాంగులుగా గుర్తించబడినట్లైతే ప్రభుత్వ పథకాలు, సౌకర్యాలు కల్పించేందుకు ఉపయోగపడతాయన్నారు. దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా నేడు ప్యారా ఒలంపిక్స్ జరిగాయన్నారు. అందులో మెరుగైన పతకాలు మన భారత దివ్యాంగులు సాధించారని కొనియాడారు. ఈ సర్వే దేశ వ్యాప్తంగా ఏకకాలంలో జరుగుతోందని, అక్టోబరు 26 లోపు పూర్తి చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి గుంటిపల్లి కళావతి, రిసోర్స్‌పర్సన్ గోలి తిరుపతిరెడ్డి, కామారెడ్డిగూడెం పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాజేంద్రకుమార్, ఎమ్మార్సీ సిబ్బంది రవీందర్‌రెడ్డి, నర్సింహులు, సంధ్య, యాకస్వామి, రామ్‌చందర్, మంజుల, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

కొమ్మూరికే మా మద్దతు

- ఆయనపై ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదు

జనగామ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. జనగామ కాంగ్రెస్‌లో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో పట్టణానికి చెందిన 30 వార్డుల పార్టీ అధ్యక్షులు స్థానికంగా బుధవారం సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై సొంత పార్టీకే చెందిన కొంతమంది ఆరోపణలు చేయడాన్ని ఖండించారు. తామంతా ప్రతాప్‌రెడ్డికి మద్దతుగా ఉంటామని తీర్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంత మంది సీజనల్ నాయకులు ప్రతాప్‌రెడ్డిపై అభాండాలు వేస్తూ పార్టీని భ్రష్టుపట్టిస్తున్నారని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీకి వత్తాసు పలికి పార్టీ ఓటమికి కారణమయ్యారని విమర్శించారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ఏ రోజూ పట్టించుకోని నాయకులు ప్రస్తుతం కొమ్మూరికి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక అసత్య ఆరోపణలతో పబ్బం గడుపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 15 ఏళ్లుగా పార్టీ ఓటమికి కారణమవుతూ కాంగ్రెస్‌లో గ్రూపులను తయారు చేస్తున్న అలాంటి వారిపై అధిష్ఠానం చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే విషయంపై అవసరమైతే సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిని కలుస్తామని అన్నారు. ఇకనైనా పద్ధతి మార్చుకొని కొమ్మూరి నాయకత్వంలో పనిచేయాలని అసమ్మతి నేతలకు సూచించారు. తామంతా కొమ్మూరికి మద్దతుగా ఉంటూ రాబోయే స్థానిక సంస్థలు, మునిసిపల్ ఎన్నికల్లో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో వివిధ వార్డుల అధ్యక్షులు కడారు ప్రవీణ్‌కుమార్, జనార్ధన్, సంజీవరెడ్డి, ప్రవీణ్, మల్లేశం, మల్లారెడ్డి, ఉపేందర్, విజయ్‌కుమార్, లక్ష్మీనారాయణ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వివిధ వార్డుల అధ్యక్షులు

ముగ్గురు కాంగ్రెస్ నేతలపై కేసు నమోదు

బెదిరించి అబద్ధం చెప్పించారన్న ఫిర్యాదుతో పోలీసుల చర్యలు

జనగామ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తనను బెదిరించి డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి వ్యతిరేకంగా బలవంతంగా అబద్ధం చెప్పించారన్న ఫిర్యాదుతో జనగామకు చెందిన ముగ్గురు కాంగ్రెస్ సీనియర్ నాయకులపై బుధవారం కేసు నమోదైంది. తనను బెదిరించి తప్పుడు ఆరోపణలు చేయించారంటూ చేర్యాలకు చెందిన కాంగ్రెస్ నేత రాగుల శ్రీనివాస్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జనగామ పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఆగస్టు 25న జనగామకు చెందిన కాంగ్రెస్ నాయకులు కంచె రాములు, వేమళ్ల సత్యనారాయణరెడ్డి, ఎర్రమల్ల సుధాకర్ ఫోన్ చేసి జనగామకు రప్పించారని శ్రీనివాస్‌రెడ్డి జనగామ పోలీసులకు ఈనెల 24న ఫిర్యాదు చేశారు. టీ తాగుదామని చెప్పి ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు తీసుకెళ్లి కొమ్మూరికి వ్యతిరేకంగా మాట్లాడాలంటూ కంచె రాములు తనను బెదిరించారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. రూ.25లక్షల సుపారీ ఇచ్చి తనను కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చంపమన్నారంటూ కంచె రాములు తనతో బలవంతంగా అబద్ధం చెప్పించి వీడియో రికార్డు చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. తనను బెదిరించి వీడియో రికార్డు చేయడంతో పాటు కాంగ్రెస్ పార్టీ వాట్సాప్ గ్రూపుల్లో వేసి తనను అవమానించారని అన్నారు. కాగా, శ్రీనివాస్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కంచె రాములు, మునిసిపల్ మాజీ చైర్మన్ వేమళ్ల సత్యనారాయణరెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ ఎర్రమల్ల సుధాకర్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ దామోదర్‌రెడ్డి తెలిపారు.

కలెక్టరేట్‌లో మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం



మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న కడియం కావ్య

జనగామ కల్చరల్, సెప్టెంబరు 25: ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాతో కలిసి ఎంపీ కావ్య ప్రారంభించారు. డీఆర్‌డీవో, సెర్ప్ ఆధ్వర్యంలో గంగోత్రి సంఘం ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్‌ను ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడుతూ మహిళలు వ్యాపార రంగాలలో రాణిస్తూ ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. వివిధ విభాగాలకు చెందిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మంచి నాణ్యతతో కూడిన ఆహారంతో పాటు రుచికరంగా భోజనం ఉండాలని క్యాంటిన్ నిర్వాహకులకు సూచించారు. అనంతరం ఎంపీ కావ్య కలెక్టర్, అదనపు కలెక్టర్, జిల్లా అధికారులతో కలిసి భోజనం చేశారు.

ఇళ్ల లబ్ధిదారుల ఆందోళన

తొర్రూరులో డబుల్ బెడ్‌రూంల నుంచి ఖాళీ చేయించిన అధికారులు

ఒంటిపై పెట్రోల్ పోసుకున్న ముగ్గురు మహిళలు



తొర్రూరులో డబుల్ బెడ్‌రూంలలో ఉన్న వారిని ఖాళీ చేయిస్తున్న అధికారులు



పెట్రోల్ పోసుకుంటున్న లబ్ధిదారులు

పాలకుర్తి, సెప్టెంబరు 25: మండలంలోని తొర్రూరు గ్రామంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నుంచి లబ్ధిదారులను ఖాళీ చేయాలని అధికారులు ఆదేశించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో కొందరు ఒంటిపై పెట్రోల్ పోసుకోగా, అధికారులు అప్రమత్తమై ఇళ్లను ఖాళీ చేయించి సీల్ వేశారు. వివరాల్లోకి వెళితే.. తొర్రూరులో 20డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించగా, రెండేళ్ల క్రితం గ్రామసభ ఏర్పాటు చేసి అధికారులు అర్హులైన లబ్ధిదారుల జాబితాను చదివి వినిపించారు. లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలు చోటుచేసుకున్నాయని స్థానికులు ఆరోపించడంతో పాటు పలు అభ్యంతరాలు రావడంతో ఎంపిక ప్రక్రియ జరగలేదు. అయితే లబ్ధిదారుల ఎంపిక జరగనప్పటికి ఇళ్లలో గ్రామానికి చెందిన కొంత మంది చొరబడి నివాసం ఉండడంతో రెవెన్యూ, పోలీసులు, అధికారులు బుధవారం ఇళ్ల వద్దకు చేరుకొని ఖాళీ చేయాలని ఆదేశించడంతో ససేమిరా అన్నారు. దీంతో అధికారులు ఇళ్లలోని వస్తువులను బయటకు తీసుకువస్తుండగా గ్రామానికి చెందిన పసులాది అంజమ్మ, పద్మ, గడ్డం భూలక్ష్మి పెట్రోల్‌ను ఒంటిపై, నోట్లో, పోసుకోవడంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. అధికారులు వెంటనే అప్రమత్తమై వారిని ఖాళీ చేయించి ఇళ్లకు సీల్ వేశారు. పెట్రోల్ పోసుకున్న వారిని పాలకుర్తి ఆస్పత్రికి తరలించడంతో ఎలాంటి ఘటనలు జరగలేదు.

అక్రమంగా చొరబడితే చర్యలు : ఆర్డీవో

తొర్రూరులో ప్రభుత్వం నిర్మించిన 20ఇళ్లలో కొంత మంది అక్రమంగా చొరబడడంతో ఖాళీ చేయించినట్లు స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో డీఎస్ వెంకన్న తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ తొర్రూరులో గతంలో గ్రామసభ ఏర్పాటు చేసినా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తికాలేదని అన్నారు. అర్హుల జాబితాను మాత్రమే చదివి వినిపించినట్లు తెలిపారు. గ్రామానికి చెందిన కొంత మంది ఇళ్లను ఆక్రమించుకొని నివాసం ఉంటుండగా అధికారులు రెండు సార్లు ఖాళీ చేయించినప్పటికి తిరిగి చొరబడడంతో ఖాళీ చేయించినట్లు చెప్పారు. కొంత మందిని ఖాళీ చేయిస్తుంటే పెట్రోల్ పోసుకొని సమస్యను జఠిలం చేసేందుకు ప్రయత్నించారని, ఎలాంటి ఘటనలు జరుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డీవో తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్‌రెడ్డి, ఆర్ఐ రాకేష్ పాల్గొన్నారు.

యశ్వంత్ ఖాతాలోకి మరో పర్వతశ్రేణి

మరిపెడ, సెప్టెంబర్ 25 : మౌంటెనర్ యశ్వంత్ ఖాతాలోకి మరో పర్వతశ్రేణి చేరింది. మరిపెడ మండలం భూక్యాతండాకు చెందిన భూక్యా రామ్మూర్తి-జ్యోతి దంపతుల చిన్నకుమారుడైన భూక్యా యశ్వంత్ అతి చిన్న వయస్సులోనే ఆయన వయస్సుకు మించి అరచేతిలో ప్రాణాలను అడ్డుపెట్టి భయంకరమైన పర్వతాలను అధిరోహిస్తూ అందరిచే శభాష్ అనిపించుకుంటున్నారు. హైదరాబాద్‌లోని ఎన్‌డీసీ డిగ్రీ కళాశాలలో డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతున్న భూక్యా యశ్వంత్ ఇప్పటికే సౌత్‌ఆఫ్రికాలోని కిలిమంజారో, యూరప్‌లోని ఎల్బ్రూస్, కోజియోసిస్, యానం, కాగ్‌చేట్, ఎవరెస్ట్ బేస్ క్యాంప్ పర్వతాలను అధిరోహించారు. సెప్టెంబరు 4వ తేది నుంచి 18రోజుల పాటు పట్టువదలని విక్రమార్కుడిలా పోరాడి 22వ తేదిన అరుణాచల్‌ప్రదేశ్‌లోని గోరిచెన్ అత్యంత క్లిష్టమైన పర్వాతాన్ని సైతం జయించారు. ఓ వైపు సడలిపోతున్న రాళ్లు, మరో వైపు ప్రమాదకరమైన మెరైన్‌గ్లేసియర్‌ను తట్టుకొని అవలీలగా గోరిచెన్ శిఖరానికి చేరుకొని త్రీవర్ణ పతకాన్ని ఎగిరేశారు. దీంతో ఆయన ఖాతాలోకి మరో పర్వతం చేరింది. ఈ పర్వత శిఖిర్నాన్ని ఎక్కేందుకు ఇది వరకు కేవలం ఆర్మీ జవాన్లకే అవకాశం ఉండేది. ప్రఖ్యాత ట్రాన్సెండ్ అడ్వెంచర్ కంపెనీ సహాయ సహకారాలు, పెద్దల దాతృత్వంతో గోరిచెన్ పర్వాతాన్ని జయించిన తొలి సివిలియన్‌గా యశ్వంత్ గుర్తింపు దేశచరిత్రలోనే గుర్తింపు పొందారు. ఈ గుర్తింపు తనకు ఎంతో సంతోషంగా ఉందని యశ్వంత్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ పేర్కొన్నారు. యశ్వంత్ పర్వతరోహణపై మరిపెడ మండల ప్రజలు, భూక్యా తండా వాసులు, ఆయనకు ఆర్థికంగా, హార్థికంగా సహకరించిన దాతలు ప్రత్యేక అభినందనలు తెలిపారు.


గోరిచెన్ పర్వతాన్ని అధిరోహించిన యశ్వంత్

సైన్స్ సెంటర్ భూములు.. స్వాహా!

(5వ పేజీ తరువాయి)

కొను గోలు చేసినట్టుగా నకిలీ డాక్యుమెంట్లు తయారు చేసి, ఇతరులకు ద ర్జాగా అమ్మకాలు చేశారని సమాచారం. ఇదే అదనుగా కొందరు ప్రైవేట్ విద్యాసంస్థల యజమానులు, ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు, ఉద్యోగులు అక్రమంగా నిర్మాణాలు చేపట్టారు. మొత్తంగా హంటర్ రోడ్డులో సుమారుగా 10ఎకరాలకు పైగా కబ్జా అయినట్లు సమాచారం. ఈ ప్రాంతంలో గజానికి రూ.50వేల నుంచి రూ.1లక్షకు పైగా ధర పలుకుతుంది. ఈ నేపథ్యం లో పదెకరాల స్థలం కబ్జా అయితే దాని విలువ రూ.200కోట్లకు పైగానే ఉంటుందని, ఇంత జరిగినా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవటం లేదనేది చర్చనీయాంశంగా మారింది.

కబ్జాల వెనుక కీలక నేతలు!

సైన్స్ సెంటర్ భూముల అన్యాక్రాంతం వెనుక బడా నేతలున్నారనే చర్చ జరుగుతోంది. అడుగు జాగా కబ్జా అయితేనే అగమాగం చేసే అధికారులు వందల కోట్ల సర్కారు స్థలం కబ్జాకు గురైతే మౌనంగా ఎందుకు ఉంటున్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. గతంలో ఈ భూముల అన్యాక్రాంతంపై లోకాయుక్తాకు ఫిర్యాదులు వెళ్లగా.. సర్వే నిర్వహించి, అక్రమణలో ఉన్నవాటిని స్వాధీనం చేసుకుంటామని అధికారులు లోకాయుక్తాకు హామీ ఇచ్చారు. ఇది జరిగి రెండేళ్లు గడుస్తున్నా ఈ భూముల స్వాహాపై నిగ్గుతేల్చడం లేదన్న చర్చ జరుగుతోంది. ఈ కబ్జాల పర్వం వెనుక గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలతో పాటు వారి అనుచరులు, తాజా, మాజీ కార్పొరేట ర్ల హస్తం ఉందనే చర్చ జరుగుతోంది. ప్రస్తుత అధికార పార్టీలో ఉన్న మరో నేత కూడా కబ్జా చేసిన భూమిలోనే తిష్ట వేశారనే ప్రచారం జరుగుతోంది. మాజీ ఎమ్మెల్యేలతో పాటు కీలకమైన నేతలు, వారి అనుచరులు అక్రమార్కుల్లో ఉండటంతోనే అధికారులు భూముల సర్వేకు వెనుకాడుతున్నారని, మాజీ ఎమ్మెల్యే అనుచరుడు యంత్రాలతో గుట్టను తవ్వి పక్క సర్వే నెంబర్లతో భారీగా రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారనే ప్రచారం జరుగుతోంది. రెండు రోజుల క్రితం రమేష్ అనే వ్యక్తి సైన్స్ సెంటర్ భూమిలో అక్రమ నిర్మాణాలు చేస్తుండగా, హనుమకొండ రెవెన్యూ అధికారులు ఆగమేఘాల మీద వెళ్లి అడ్డుకున్నారు. అదే అధికారులు గత ప్రభుత్వం హయాంలో స్వాహా చేసిన కబ్జాకోరులపై ఎందుకు దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కలెక్టర్ చొరవ తీసుకుని సర్వే నెంబరు 964, 966లో ఉన్న 49ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించేందుకు వెంటనే టైగర్ హిల్స్(పులి గుట్ట)లో భూ సర్వే నిర్వహించాలని, కోట్లాది రుపాయల విలువ చేసే ప్రభుత్వ భూములకు కబ్జాకోరుల నుంచి విముక్తి కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి రాజనర్సింహకు వినతి పత్రం అందిస్తున్న వైద్యులు

పల్లె దవాఖాన వైద్యుల వేతనాలు పెంచాలి

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 25: పల్లె దవాఖాన వైద్యుల వేతనాలు పెంచాలని పెంచాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను పల్లె దవాఖాన వైద్యులు కోరారు. ఈ మేరకు మంత్రిని హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రతీ గ్రామంలో జ్వర సర్వే నిర్వహిస్తూ సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తున్నామని, అవసరమైన వారికి మందులు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పల్లె దవాఖానా డాక్టర్స్ ప్రెసిడెంట్ డాక్టర్ రవికుమార్, సెక్రటరీ డాక్టర్ అరుణ్ కుమార్, డాక్టర్ వీరేంద్రనాథ్, డాక్టర్ రవికుమార్, డాక్టర్ దశరథ్, డాక్టర్ సురేశ్, డాక్టర్ విజయ్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సీఐపై సీపీకి ఫిర్యాదు

వరంగల్ క్రైం, సెప్టెంబరు 25: వరంగల్ డివిజన్ పరిధిలోని ఒక స్టేషన్ సీఐపై సీపీ అంబర్ కిషోర్ ఝాకు బాధితుడు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఇటీవల అధికార పార్టీకి చెందిన ఒక డివిజన్ నేతను స్టేషన్‌కు పిలిపించి అక్రమ కేసు నమోదు చేసిన సీఐ.. తీవ్రంగా కొట్టినట్లు సమాచారం. డివిజన్‌కు చెందిన ఇద్దరు నేతలకు, అదే డివిజన్‌కు చెందిన మరోనేతకు మధ్య అభిప్రాయ భేదాలు వచ్చినట్లు తెలిసింది. దీంతో ఇద్దరు నేతలు నియోజకవర్గంలో హవా కొనసాగిస్తున్న ఒక వ్యక్తితో సీఐకి ఫోన్‌చేయించి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో సీఐ డివిజన్ నేతను స్టేషన్‌కు పిలిచి కేసుపెట్టడంతో పాటు చేయిచేసుకున్నట్లు తెలిసింది. ఈ విషయమై మనస్థాపానికి గురైన డివిజన్ నేత.. బుధవారం సీపీని కలిసి సీఐపై ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీనిపై సీపీ విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. మొత్తంగా వరంగల్ కమిషనరేట్ పోలీసులు నేతల మెప్పు కోసం ప్రయత్నిస్తూ వివాదాల్లో ఇరుక్కుంటున్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటిస్తేనే బిల్లుల చెల్లింపు

వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



డ్రైనేజీని పరిశీలిస్తున్న కమిషనర్ అశ్విని

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 25: గ్రేటర్ వరంగల్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తేనే బిల్లుల చెల్లింపులు జరుగుతాయని, లేదంటే బిల్లులు నిలిపివేస్తామని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే కాంట్రాక్టర్లను హెచ్చరించారు. గ్రేటర్ వరంగల్ 28వ డివిజన్ హంటర్‌రోడ్డు ప్రాంతంలో 100ఫీట్ల రోడ్డు వద్ద నిర్మించిన సీసీరోడ్డులో పాటు సాయినగర్ ప్రాంతంలో నిర్మించిన డ్రైనేజీని కమిషనర్‌తో పాటు అధికారులు బుధవారం పరిశీలించారు. కొలతలు వేసి పరిశీలించి అక్కడి పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈఈ శ్రీనివాస్, డీఈలు రాజ్‌కుమార్, రంగారావు, కృష్ణమూర్తి, ఏఈలు సతీష్, హరికుమార్, ముజామిల్ పాల్గొన్నారు.



కాంతులీనుతున్న.. కళా సౌధం..

ప్రారంభానికి సిద్ధమవుతున్న కాళోజీ కళాక్షేత్రం

ఉమ్మడి జిల్లా సాంస్కృతిక కళావైభవాన్ని చాటిచెప్పేలా.. హనుమకొండ బాలసముద్రంలోని హయగ్రీవాచారి మైదానంలో మూడున్నర ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన కాళోజీ కళాక్షేత్రం ప్రారంభానికి సిద్ధమవుతోంది. 2014లో నాటి సీఎం కేసీఆర్ జైపూర్‌లో రాజమహల్ తరహాలోని ఈ రాజసౌధానికి శంకుస్థాపన చేయగా.. రూ.85కోట్లతో చేపట్టిన పనులు దాదాపు పూర్తయ్యాయి. వచ్చేనెలలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవ వేడుక ఉండబోతోందని అధికారులు ఇప్పటికే తెలిపారు. ఈ నేపథ్యంలో కాళోజీ కళాక్షేత్రాన్ని రంగురంగుల విద్యుత్‌దీపాలతో అలంకరించడంతో కళాక్షేత్ర భవనం ధగధగమెరిసిపోతోంది. ఇక బుధవారం ఈ కళాక్షేత్రంలో జరుగుతున్న ఏర్పాట్లను కలెక్టర్ పి.ప్రావీణ్య, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్వినితానాజీ వాకడే పరిశీలించారు. మిగిలిన పనుల వివరాలను నిర్వహణ సంస్థ ప్రతినిధులను ద్వారా తెలుసుకున్న వారు త్వరితగతిన పూర్తిచేయాలని , ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని సూచించారు.

- బాలసముద్రం(హనుమకొండ)

మార్కెట్లో తడిచిన మొక్కజొన్నలు

● ఓపెన్ యార్డులో నీటిలో కొట్టుకుపోయిన ఆరబెట్టిన మక్కలు
● వెయ్యి బస్తాలకుపైగా సరుకు ఆగం ● టార్పాలిన్లు ఇవ్వడంలేదని రైతుల ఆరోపణ



కేసముద్రం మార్కెట్ యార్డులో తడిచిన మొక్కజొన్నలను దగ్గరకు చేరుస్తున్న రైతులు



తడిచిన మొక్కజొన్నలను తీస్తున్న రైతు భూక్య రాంజీ

కేసముద్రం, సెప్టెంబర్ 25 : కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో బుధవారం ఓపెన్ యార్డులో ఆరబెట్టుకున్న మొక్కజొన్నలు తడిచిపోయాయి. కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు 65 మంది రైతులు 2076 బస్తాల్లో 1246 క్వింటాళ్ల మొక్కజొన్నలను విక్రయించేందుకు మార్కెట్‌కు తీసుకవచ్చారు. రైతులు తమ చెల్కల వద్ద స్థలం లేకపోవడంతో మార్కెట్‌కు మొక్కజొన్నలను తీసుకువచ్చి ఓపెన్ యార్డులో ఆరబెట్టుకున్నారు. మరికొంత మంది రైతులు తమ సరుకు తేమశాతం అధికంగా ఉండడంతో ఓపెన్ యార్డులో పోసుకున్నారు. మధ్యాహ్నం అకస్మాత్తుగా వర్షం రావడంతో రైతులు తమ సరుకును కుప్పగా పోసుకొని, రక్షించుకునేంత వ్యవధి కూడా లేక సరుకు పూర్తిగా తడిచిపోయింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట అకస్మాత్తుగా కురిసిన వర్షంతో వరద నీటిలో మొక్కజొన్న కొట్టుకుపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ సరుకు ఆరబెట్టుకు వారిలో కొంతమంది ఈ-నామ్ లాట్ తీసుకున్నవారు సైతం ఉన్నారు. వర్షం వస్తున్న సమయంలో మార్కెట్ కార్యాలయంలో టార్పాలిన్లు కావాలని అడిగే లేవని సమాధానం చెప్పారని మండలంలోని పెనుగొండకు చెందిన రైతు శీలం శ్రీధర్‌తోపాటు మరికొంతమంది రైతులు ఆరోపించారు. మార్కెట్లో ఆరబెట్టుకున్న సరుకుకు తాము బాధ్యత వహించబోమని మార్కెట్ అధికారులు ఖరాకండితంగా చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పెనుగొండకు చెందిన తుప్పర్తి భద్ర య్య, నర్సింహులగూడెం భూక్య రాంజీ, నారాయణపురం నాంపెల్లి సురేందర్, భూక్య మంగ్యా, గుగులోత్ వెంకన్న, భవానిగడ్డతండా ధరావత్ లచ్చీరాం తదితరులకు చెందిన సుమారు వెయ్యి బస్తాలకుపైగా మొక్కజొన్నలు తడిచిపోయాయి.

నేడు బల్దియాలో ఉచిత వైద్య శిబిరం

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 25: గ్రేటర్ వరంగల్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి స్వచ్ఛతాహీ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు బల్దియా ప్రధాన కార్యాలయం ఆవరణలోని ఇండోర్ స్టేడియంలో ఈ శిబిరం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే హాజరవుతారని తెలిపారు. పారిశుధ్య కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ విధులు నిర్వర్తించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9701999689 సెల్ నెంబర్‌కు ఫోన్‌చేయాలని డాక్టర్ రాజేశ్ తెలిపారు.

30 నుంచి కేయూ మెస్‌కు దసరా సెలవులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 25: కాకతీయ యూనివర్సిటీలోని మెస్‌లకు సెప్టెంబరు 30 మధ్యాహ్నం నుంచి దసరా పండువను పురస్కరించుకుని సెలవులను ప్రకటిస్తున్నట్లు వర్సిటీ హాస్టల్స్ డైరెక్టర్ డాక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీలో దసరా సెలవులు అక్టోబరు 2 నుంచి 14 వరకు ప్రకటించారన్నారు. కాగా, విద్యార్థులకు అక్టోబరు 15 నుంచి మెస్‌లన్నీ యథావిధిగా పునఃప్రారంభం అవుతాయని స్పష్టం చేశారు. అక్టోబరు 15 తర్వాత విద్యార్థులు హాస్టల్స్ అడ్మిషన్లు రెన్యూవల్ చేసుకోవాలని వారికే భోజనం పెడతామని స్పష్టం చేశారు.

కాంట్రాక్టు ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 25: కాకతీయ వైద్య కళాశాలలో వివిధ విభాగాల్లో కాంట్రాక్టుపై 68 అసిస్టెంట్ ప్రొఫెసర్, నాలుగు సీఎఎస్‌ఆర్‌ఎంవో పోస్టుల భర్తీకి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి కేఎంసీ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈనెల 27 నుంచి అక్టోబరు 3వ తేదీ వరకు కేఎంసీలో ఉదయం 10 నుంచి 4 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కేఎంసీ ప్రిన్సిపాల్ ప్రకటనలో పేర్కొన్నారు.

ట్రెయినీ ఎస్సైలకు పోలీసు స్టేషన్‌ల కేటాయింపు

వరంగల్ క్రైం, సెప్టెంబరు 25: శిక్షణ పూర్తి చేసుకున్న ఎస్సైలకు కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్‌లను కేటాయిస్తూ బుధవారం సీపీ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. పల్లె పవన్‌కు కాజీపేట, మామునూరు, బి.హేమలతకు సుబేదారి, వర్ధన్నపేట, బండారి శివకు మిల్స్‌కాలనీ, రఘునాథపల్లి, బి.సుజిత్‌కు ఆత్మకూరు, హనుమకొండ, అనంతగిరి మధుకు జనగామ, ఇంతెజార్‌గంజ్, లింగాల దిలీప్‌కు నర్సంపేట, హసన్‌పర్తి, పి.భాగ్యశ్రీకి స్టేషన్ ఘన్‌పూర్, పరకాల పోలీసుస్టేషన్‌లకు కేటాయించారు. ప్రతీ ఎస్సైకి రెండు స్టేషన్‌లు కేటాయించారు. వీరు ఈనెల 25 నుంచి వచ్చేనెల 10వరకు ఒక స్టేషన్, వచ్చేనెల 10 నుంచి 24వ తేదీ వరకు మరో స్టేషన్‌లో విధులపై శిక్షణ తీసుకోనున్నారు.



కేఎంసీలో జరిగిన ఉత్కర్ష వేడుకల్లో విద్యార్థుల నృత్యాలు





వేడుకలను ప్రారంభిస్తున్న అధికారులు

ఉత్సాహంగా సాగుతున్న ఉత్కర్ష

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 25: కాకతీయ వైద్య కళాశాల విద్యార్థులు ఉత్కర్ష వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. బుధవారం ఐదోరోజు ట్రెడిషనల్ డే నిర్వహించారు. ఇందులో విద్యార్థులు వివిధ రాష్ట్రాల సంప్రదాయ వస్త్రాధారణలో కనిపించారు. సాంస్కృతిక ప్రదర్శనలతో విశేషంగా ఆకట్టుకున్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ సంధ్య ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను అభినందించారు. అనంతరం ట్రెడిషనల్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి బహుమతులను అందజేశారు. సాయంత్రం విద్యార్థులు దాండిక కార్యక్రమాన్ని నిర్వహించగా విద్యార్థులు నృత్యాలతో అలరించారు.

తల్లిదండ్రులు తలెత్తుకునేలా అమ్మాయిలు ఎదగాలి..

కేయూలో మహిళ ఇంజనీరింగ్ కళాశాల అవిర్భావ వేడుకల్లో డీసీపీ షేక్ సలీమా



యూ బ్లెడ్ యాప్‌ను ఆవిష్కరిస్తున్న డీసీపీ షేక్ సలీమా, ఈసీ మెంబర్లు సురేశ్‌లాల్, నిమ్మ సుదర్శన్ తదితరులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 25: అమ్మాయిలు తమ తల్లిదండ్రులు తలెత్తుకునేలా జీవితంలో ఎదగాలని వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా ఉద్బోధించారు. గురువారం కేయూ సెనెట్ హాల్‌లో వర్సిటీ క్యాంపస్ మహిళ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భిక్షాలు అధ్యక్షతన కళాశాల అవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన షేక్ సలీమా మాట్లాడుతూ.. మహిళలందరూ అన్ని రంగాల్లో ముందుడాలని పిలుపునిచ్చారు. విద్యార్థినులు బాగా చదువుకుని ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సాధించాలని సూచించారు. జీవితంలో కష్టపడి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఉద్బోధించారు. షీటీంలపై అవగాహన ఉండాలని చెప్పారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నాగమణి మాట్లాడుతూ.. అమ్మాయిలు చదువులతో పాటు వ్యక్తిగత రక్షణ, సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. మంచి గుర్తింపు తెచ్చుకుని తమ కిష్టమైన రంగాల్లో మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవాలని పేర్కొన్నారు.

సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భిక్షాలు మాట్లాడుతూ.. ప్రైవేట్ కళాశాలతో పోటీపడి విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు. క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్, పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ మాట్లాడుతూ.. అమ్మాయిలు చదువులతో పాటు తల్లిదండ్రుల ఆశలు, ఆశయాలను నెరవేర్చాలని అన్నారు. వర్సిటీ న్యాయకళాశాల ప్రిన్సిపాల్, పాలక మండలి సభ్యుడు డాక్టర్ నిమ్మ సుదర్శన్ మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ విద్యకు బాగా డిమాండ్ ఉందని చెప్పారు. ఖరీదైన ఇంజనీరింగ్ విద్యను గ్రామీణ ప్రాంతాల్లోని అమ్మాయిలకు వర్సిటీ క్యాంపస్ కళాశాల అందిస్తోందని వివరించారు. విద్యార్థులు దీన్ని సద్వినియోగం చేసుకుని ఎదగాలని హితవు పలికారు. ఈసీ మెంబర్ డాక్టర్ బొద్దిరెడ్డి రమారెడ్డి మాట్లాడుతూ.. జీవితంలో స్థిరపడేందుకు మంచి అవకాశాలున్నాయని చెప్పారు. ఈసీ మెంబర్ డాక్టర్ చిర్ర రాజు మాట్లాడుతూ. వర్సిటీ మహిళ ఇంజనీరింగ్ కళాశాలలో పేద, మధ్యతరగతి యువత చదువుకుని టెక్నాలజీరంగంలో ఎదుగుతున్నారని అన్నారు.

కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బి.కిరణ్‌కుమార్ కన్వీనర్‌గా వ్యవహరించగా, అధ్యాపకులు డాక్టర్ వీణ, తూర్పాటి వెంకటేశ్, సురేందర్, సాయి తరుణ్, స్వప్న, వాణిశ్రీ, సాహితీ, యశస్విని, దీప్తి, పీవీ వైష్ణవి, రచన, శ్రీజ, కిషన్, దేవేందర్, వాణి, డాక్టర్ జ్యోత్స్న, అనూష, రమ, జ్యోతి ఏఆర్ ఆర్.వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ వీరునాయక్, బోధనేతర సిబ్బంది మల్లేశం, జగన్, యాదగిరి, ఫిరోజ్, హుస్సేన్, చైతన్య, లావణ్య, నాగరాజు, తాజ్‌బాబా, ప్రమీల, మమత, విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల అవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలు చేశారు. అలాగే క్రీడాపోటీల్లోనూ ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు అతిథులు చేతుల మీదుగా బహుమతులను అందచేశారు. ఈ సందర్భంగా అతిథులు యూ బ్లెడ్‌యాప్‌ను ఆవిష్కరించారు. రక్తదాన ప్రాధాన్యతను అందరూ గుర్తించాలని పేర్కొన్నారు.

గుండెపోటుతో ఆర్టీసీ డ్రైవర్ లక్ష్మణ్ నాయక్ మృతి

వడ్డెపల్లి, సెప్టెంబరు 25: గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ సదాశివ కాలనీకి చెందిన ఆర్టీసీ డ్రైవర్ కునుసూతు లక్ష్మణ్ నాయక్ (57)గుండె పోటుతో బుధవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. లక్ష్మణ్ నాయక్ భౌతికకాయాన్ని పరకాల ఆర్టీసీ డిపో ఇన్‌చార్జి మేనేజర్ ధరంసింగ్, ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ యూనియన్ నేత గోవర్ధన్ నాయక్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల కోసం రూ.20వేలను ప్రభుత్వ పరంగా కుటుంబ సభ్యులకు అందించారు. 56వ డివిజన్ కార్పొరేటర్ సిరంగి సునిల్‌కుమార్, ఎస్‌డీఎల్‌సీఈ మాజీ డైరెక్టర్ గుగులోత్ వీరన్న నాయక్ తదితరులు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

క్యాన్సర్ నిర్మూలనకు సమగ్ర పరిశోధనలు జరగాలి

హైదరాబాద్ హెచ్‌సీయూ ప్రొఫెసర్ గీత కె.వేముగంటి
కేయూలో జంతుశాస్త్రం రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభం



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న గీత వేముగంటి, రిజిస్ట్రార్ మల్లారెడ్డి, ఇస్తారి తదితరులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 25: క్యాన్సర్ నిర్మూలనకు సమగ్ర పరిశోధనలు జరగాలని హైదరాబాద్ కేంద్రియ యూనివర్సిటీ జంతుశాస్త్ర విభాగం సీనియర్ ప్రొఫెసర్ గీత కె.వేముగంటి అన్నారు. బుధవారం జంతుశాస్త్ర విభాగంలో రెండురోజుల జాతీయ సదస్సు క్యాంపస్‌లోని జువాలజీ సెమీహాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా గీత కె.వేముగంటి మాట్లాడుతూ.. 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ యానిమల్ సైన్సెస్' అనే అంశం కీలక ప్రసంగం చేశారు. క్యాన్సర్ స్టెమ్ సెల్స్‌పై పరిశోధన అవసరమన్నారు. సాధారణ కణాలు ఉత్పరివర్తనం చెందడంతో క్యాన్సర్ కణాలుగా మారుతాయని పేర్కొన్నారు. క్యాన్సర్ కణాలు శరీరంలో ఇతర విభాగాలకు వ్యాప్తి చెందుతాయని చెప్పారు. క్యాన్సర్ చివరి దశలో ప్రాణ ప్రాయం స్థితి ఏర్పడుతోందని చెప్పారు. క్యాన్సర్ చికిత్సలో వాడే మందుల వలన రోగ నిరోధక శక్తి క్రమగా తగ్గుతోందని అన్నారు. క్యాన్సర్ మూల కణాలపై సమగ్ర పరిశోధనలు జరగాలని అన్నారు. పరిశోధనలతోనే అనేక రకాల వ్యాధులకు ఔషధాలను కనుగొనేందుకు వీలవుతుందని చెప్పారు.

కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి మాట్లాడుతూ.. బయోటెక్నాలజీ రంగంలో దేశం ముందుకుపోతోందని అన్నారు. విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు రెండురోజుల జాతీయ సదస్సును నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. జువాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ షమిత మాట్లాడుతూ.. రెండు రోజుల జాతీయ సదస్సుల్లో ప్రొఫెసర్లు, పరిశోధకులు, విద్యార్థులు 100మంది వరకు విలువైన పరిశోధన పత్రాలను సమర్పిస్తారని వెల్లడించారు. బెంగళూరు గీతం వర్సిటీతోపాటు ఇతర వర్సిటీ నుంచి అతిథులు హాజరుకానున్నట్లు వివరించారు. సెమినార్ సావనీర్‌ను అతిథులతో కలిసి ప్రొఫెసర్ వై.వెంకయ్య, ప్రొఫెసర్ ఈసం నారాయణ, డాక్టర్ మామిడాల ఇస్తారీ ఆవిష్కరించారు.



హనుమకొండ బస్టాండ్‌లో పోగొట్టుకున్న బంగారు గొలుసును అందిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

పోగొట్టుకున్న బంగారం అప్పగింత

బాలసముద్రం, సెప్టెంబరు 25: హైదరాబాద్ నుంచి భూపాలపల్లికి ప్రయాణం చేస్తున్న ఓ వృద్ధురాలు పోగొట్టుకున్న బంగారు గొలుసును ఆర్టీసీ సిబ్బంది గుర్తించి ఆ వృద్ధురాలికి అందించారు. బుధవారం ఆర్టీసీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన ఆకుల శంకరమ్మ బుధవారం హైదరాబాద్ నుంచి భూపాలపల్లికి ఎక్స్‌ప్రెస్ బస్సులో ప్రయాణిస్తోంది. హనుమకొండలో దిగిన శంకరమ్మ తన బంగారు గొలుసు ఉన్న పర్సును బస్సులోనే మరిచిపోయింది. పర్సు పోయిందని గమనించిన ఆమె.. అక్కడ ఉన్న సెక్యూరిటీ సిబ్బంది నవీన్, ఆర్.శ్రీధర్‌లకు విషయాన్ని తెలిపింది. వెంటనే స్పందించిన వారు శంకరమ్మ ప్రయాణించిన బస్సు హనుమకొండ బస్టాండ్ నుంచి బయటకు వెళ్తుండగా బస్సును నిలిపివేసి అందులో ఉన్న బంగారం, ఇతర వస్తువులు తీసుకొచ్చి శంకరమ్మకు అందించారు. ఈ సందర్భంగా బస్టేషన్ మేనేజర్ సెక్యూరిటీ సిబ్బందిని అభినందించారు.

మైనర్లపై కేసు నమోదుపై ఆరా

ప్రభుత్వానికి ఇంటెలిజెన్స్ నివేదిక

వరంగల్ క్రైం, సెప్టెంబరు 25: మైనర్లపై కేసు నమోదుపై ప్రభుత్వం ఆరా తీసింది. దీనిపై ఇంటెలిజెన్స్ అధికారులు నివేదికను పంపించారు. బుధవారం పత్రికల్లో మైనర్లపై కేసు నమోదుపై కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై ప్రభుత్వం నివేదికను కోరగా ఇంటెలిజెన్స్ అధికారులు పంపారు. కట్ల రాజు అనే సీఐడీ కానిస్టేబుల్ సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంనగర్ టవర్స్‌లో ఉంటున్నాడు. ఈయనకు కూతురు ఉంది. అదే అపార్ట్‌మెంట్‌లో ఉన్న 8మంది పిల్లలు రాజు కూతురిని దూషిస్తూ కారుపై గీతలు గీశారు. సీసీ ఫుటేజీ ద్వారా పిల్లలు చేసిన పనిని గుర్తించి వారి తల్లిదండ్రులకు చెప్పారు. అయితే కారు రిపేరుకు డబ్బులు చెల్లిస్తామని చెప్పి 10రోజుల వరకు స్పందించలేదు. దీంతో కానిస్టేబుల్ రాజు సుబేదారి స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయగా, ఇన్సూరెన్స్ కంపెనీ కారు డ్యామేజీకి రూ.80వేలు చెల్లించింది. కేసు విచారణలో భాగంగా పిల్లల తల్లిదండ్రులను ఎస్ఐ పిలిపించినందుకు సోషల్ మీడియాలో వైరల్ అయిందని, ఆపై పత్రికల్లో కథనాలు వచ్చాయని నివేదికను ఇంటెలిజెన్స్ అధికారులు పంపించారు.

ఆ 'పెద్ద మనిషి' ఎవరు?

● ఆరా తీస్తున్న నిఘా వర్గాలు
● పోలీసులు మర్యాదలపై సీఎం సీరియస్

వరంగల్ క్రైం, సెప్టెంబరు 25: వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పోలీసు మర్యాదలు పొందుతున్న వ్యక్తిపై నిఘా వర్గాలు ఆరా తీసినట్లు సమాచారం. మంగళవారం కార్పొరేషన్‌కు వచ్చిన సదరు వ్యక్తికి ఒక ఏసీపీ, సీఐలు మర్యాదలు చేయడం చర్చనీయాంశంగా మారింది. అధికార పార్టీలో సాధారణవ్యక్తిగా ఉన్న ఆ వ్యక్తికి ఇద్దరు గన్‌మెన్‌లు సైతం ఉన్నట్లు సమాచారం. ఆ వ్యక్తి విషయం హాట్ టాపిక్‌గా మారడంతో ముఖ్యమంత్రి దృష్టికి సైతం వెళ్లినట్లు తెలిసింది. దీనిపై సీఎం సీరియస్ అయినట్లు సమాచారం. అతడికి గన్‌మెన్‌లు ఎందుకు ఇచ్చారని పోలీసు అధికారులను ప్రశ్నించినట్లు తెలిసింది. అధికార పార్టీ పేరు చెప్పుకుని పార్టీకి నష్టం కలిగే పనులు చేసేవారిని క్షమించకూడదని జిల్లా పార్టీ నేతలకు రేవంత్‌రెడ్డి సూచించినట్లు సమాచారం. సదరు వ్యక్తికి గన్‌మెన్‌లను తొలగించడంతో పాటు పార్టీకి దూరం పెట్టే అవకాశాలున్నట్లు తెలిసింది. మర్యాదలు చేసిన పోలీసు అధికారులపై త్వరలో చర్యలుండే అవకాశం ఉన్నట్లు అధికారిక సమాచారం.

నేడు చాకలి ఐలమ్మ జయంతి

జనగామ కల్చరల్, సెప్టెంబరు 25: వీరనారి చాకలి ఐలమ్మ 129వ జయంతిని ఈ నెల 26న నిర్వహిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రవీందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో నిర్వహించబడుతుందని, జిల్లా ప్రజాప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం స్థల పరిశీలన

కొడకండ్ల, సెప్టెంబరు 25: మండలకేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం మొగుళ్ల చెరువు గుట్ట దగ్గర ఆర్డీవో వెంకన్న బుధవారం స్థల పరిశీలన చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రిజిస్టర్లు పరిశీలించి, వైద్య సిబ్బంది, రోగులతో మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనతో పాటు ఇన్‌చార్జ్ తహసీల్దార్ చంద్రమోహన్, ఆర్ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బాల్యస్నేహితుల సాయం

లింగాలఘణపురం, సెప్టెంబరు 25: మండలంలోని నెల్లుట్లలో ఇటీవల మృతి చెందిన కన్నెబోయిన ప్రభాకర్ కుటుంబానికి బాల్య స్నేహితులు బుధవారం రూ.50వేల ఆర్థిక సాయం అందజేశారు. మృతుడి కుటుంబాన్ని సందర్శించి భార్య సరిత, కుమారుడు మణికంఠ, కుమార్తె నిహారికను ఓదార్చి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆర్థికసాయం అందజేసిన వారిలో మారబోయిన సందీప్, మొటికె సంపత్, తుపాకుల వెంకటేశ్, రంగు రాజు, మామిళ్ల అంజనేయులు, గొరిగె సంపత్, గొరిగె మధు తదితరులు ఉన్నారు.

కళాక్షేత్రానికి చుక్క సత్తయ్య పేరు పెట్టాలి

లింగాలఘణపురం, సెప్టెంబరు 25: ప్రభుత్వం నూతనంగా నిర్మాణం చేసిన కళాక్షేత్రానికి ప్రఖ్యాత ఒగ్గు కళాకారుడు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చుక్క సత్తయ్య పేరు పెట్టాలని బహుజన కులాల ఐక్యవేదిక ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ప్రతినిధుల బృందం బుధవారం హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కళాక్షేత్రానికి సబ్బండ వర్గాలకు ఆమోదయోగ్యమైన చుక్క సత్తయ్య పేరు పెట్టే విషయమై సీఎంకు ప్రతిపాదిస్తానని హామీ ఇచ్చినట్లు బహుజన కులాల ఐక్యవేదిక ప్రతినిధులు తెలిపారు.

డీసీసీబీ ద్వారా విస్తృత సేవలు : బీఎం

బచ్చన్నపేట, సెప్టెంబరు 25: మండలంలోని రైతులకు డీసీసీబీ చేర్యాల బ్రాంచి ద్వారా విస్తృత సేవలు అందజేస్తున్నట్టు బ్రాంచి మేనేజర్ కాపర్తి సంపత్ తెలిపారు. బుధవారం బచ్చన్నపేటలోని పీఏసీఎస్‌ను సందర్శించి మాట్లాడారు. పీఏసీఎస్ పరిధిలో 1450 మంది ఖాతాదారులున్నారని తెలిపారు. క్రాప్ లోన్లు, ఉన్నత చదువులు, గొర్రెల యూనిట్లు, డెయిరీ ఫాంలు, అగ్రికల్చర్ డెవలప్‌మెంట్, ఇళ్ల నిర్మాణాలకు రుణాలు ఇవ్వడం జరుగుతోందన్నారు. చేర్యాల, బచ్చన్నపేట మండలాల పరిధిలో 420 మందికి మార్టిగేజ్ చేసుకుని రుణాలు ఇచ్చామని తెలిపారు. డిపాజిట్లు చేసుకునే వారికి అధిక మొత్తంలో వడ్డీ ఇస్తున్నది డీసీసీబీ బ్యాంకేనని అన్నారు. ఖాతాదారులకు ఇంకా మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. సీఈవో బాలస్వామి, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ల పనులు వేగవంతం చేయండి

▸▸ ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి

చిలుపూర్, సెప్టెంబరు 25: మండలంలోని కొండాపూర్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో మంజూరైన విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి విద్యుత్ అధికారులను ఆదేశించారు. స్టేషన్‌ఘన్‌పూర్ ట్రాన్స్‌కో డీఈ గడ్డం గణేశ్ ఆధ్వర్యంలో ఇంజనీర్ల బృందం బుధవారం ఎమ్మెల్యే కడియంను హనుమకొండలోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్నందజేశారు. నూతనంగా మంజూరైన సబ్‌స్టేషన్ల నిర్మాణం కోసం అవసరమైన ప్రభుత్వ స్థలాన్ని కేటాయించేందుకు ప్రత్యేక చొరవ చూపాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం మాట్లాడుతూ మండలంలోని కొండాపూర్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో మంజూరైన సబ్‌స్టేషన్లకు ప్రభుత్వ స్థలాలు కేటాయించేందుకు చర్యలు చేపడతానని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో ఏడీ వంశీ, ఏఈ రమేష్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యున్నతికి క్రీడలు కీలకం : ఆర్డీవో



శివునిపల్లి హైస్కూల్‌లో క్రీడలను ప్రారంభిస్తున్న ఆర్డీవో వెంకన్న



జనగామ గురుకులంలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, సెప్టెంబరు 25: విద్యార్థులు పాఠశాల దశలోనే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని, వారి అభ్యున్నతికి క్రీడలు కీలకమని ఆర్డీవో డీఎస్ వెంకన్న అన్నారు. బుధవారం స్టేషన్‌ఘన్‌పూర్ మండల స్థాయి 68వ ఎస్‌జీఎఫ్ రెండు రోజుల బాలబాలికల కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడల ఎంపిక పోటీలను స్థానిక శివునిపల్లి హైస్కూల్‌లో ఆర్డీవో ప్రారంభించి మాట్లాడారు. మానసిక, శారీరక వికాసానికి, ఆత్మ విశ్వాసానికి క్రీడలు దోహదం చేస్తాయని అన్నారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, ఆడడమే ముఖ్యమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.వెంకటేశ్వర్లు, సీఐ జి.వేణు, ఎంపీడీవో ఎ.విజయశ్రీ, ఎంఈవో జి.కొమురయ్య, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు కె.రమేశ్, ఎం.సంపత్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దస్తగిరి, వై.ప్రభాకర్, క్రీడల కన్వీనర్ కొండ రవి, పీడీలు జి.శ్రీనివాస్, వి.చంద్రశేఖర్‌రెడ్డి, టి.వెంకటేశ్వర్లు, జి.ప్రమోద్‌రెడ్డి, సుభాష్, సుధాకర్, చందర్, అశోక్, రమేశ్, రాజు, మహేందర్, మంజుల, కొమురమ్మ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

- జనగామ కల్చరల్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం మండల స్థాయి క్రీడలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. జనగామ జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జరిగిన క్రీడల్లో విద్యార్థులకు అండర్-14, 17 విభాగాలలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహించారు.

కార్యక్రమానికి డీఈవో కె.రాము ముఖ్య అతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించగా మండల నోడల్ అధికారి రాజేందర్, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, క్రీడల కన్వీనర్ అజ్మీర కిషన్, నర్సింహులు గౌడ్, నాగేశ్వర్ రావు పాల్గొన్నారు. ఈ క్రీడల్లో 600 మంది విద్యార్థులు పాల్గొనగా, న్యాయ నిర్ణేతలుగా లచ్చిరామ్, నరేందర్‌గౌడ్, వీర్యా నాయక్, హన్మంతరావు, రవి, వేణు వ్యవహరించారు.

- నర్మెట : నర్మెట మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడలు బుధవారం ప్రారంభమయ్యాయి. క్రీడల ప్రారంభానికి హెచ్‌ఎం వేణు అధ్యక్షత వహించగా బచ్చన్నపేట ఎంఈవో వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మండల స్థాయి క్రీడల ఎంపికలో 14, 17 సంవత్సరాల లోపు విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్ర మంలో కబడ్డీ అసోసియేషన్ మండలాధ్యక్షుడు మోహన్ పాల్గొన్నారు.

ఆస్పత్రిలో ఫార్మసిస్ట్ డే

బచ్చన్నపేట, సెప్టెంబరు 25: మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో అంతర్జాతీయ ఫార్మసిస్ట్ డేను బుధవారం ఘనంగా జరిపారు. కేక్ కట్ చేసి పంచుకున్నారు. ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించేందుకు ఫార్మసిస్టులు పోషించే పాత్ర ప్రాధాన్యత కలిగిందన్నారు. వైద్యులు సృజన, మానస, సిద్ధి సుదర్శన్, అనాంభిక, ఫార్మాసిస్టులు బొడ్డు శ్రీనివాస్, నగేష్, లలిత, సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

లింగాలఘణపురం, సెప్టెంబరు 25: మండలంలోని కిష్టగూడెం గ్రామానికి చెందిన మేకల మల్లేశం(48) అనే వ్యక్తి కుటుంబ కలహాల కారణంగా మంగళవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు గ్రామస్థులు తెలిపారు. పోలీసులు తెలిపిన ప్రకారం... మల్లేశం కొన్నేళ్లుగా మద్యానికి అలవాటుపడి కుటుంబ సమస్యల పట్ల నిర్లక్ష్యం చేస్తుండటంతో భార్య రేణుక నిలదీస్తుండేది. ఎప్పటిలాగే మంగళవారం మద్యం తాగొచ్చిన భర్తను నిలదీయడంతో ఇద్దరి మధ్య వివాదం తలెత్తింది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన మల్లేశం పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, ఎస్సై శ్రవణ్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు.

రిజర్వాయర్‌లో దూకి గృహిణి..

రఘునాథపల్లి, సెప్టెంబరు 25: అనారోగ్య సమస్యలను భరించలేక జీవితంపై విరక్తి చెంది అశ్వరావుపల్లి రిజర్వాయర్‌లో పడి గృహిణి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మండలంలోని కుసుంబాయితండా గ్రామ పంచాయతీ పరిధిలోని చర్లతండాలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం... చర్లతండాకు చెందిన గుగులోతు సుక్కమ్మ(46) 15ఏళ్ల నుంచి షుగర్ తదితర వ్యాధులతో బాధపడుతుంది. ఆరు నెలల నుంచి తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తడంతో జీవితంపై విరక్తి చెంది చర్లతండా పక్కనే ఉన్న అశ్వరావుపల్లి రిజర్వాయర్‌లో పడి ఆత్మహత్య చేసుకుంది. చర్లతండాకు చెందిన గుగులోతు భద్రు రిజర్వాయర్ పక్కనే ఉన్న పొలం వద్దకు వెళ్తుండగా రిజర్వాయర్ నీటిపై తేలుతున్న సుక్కమ్మ మృతదేహం కనిపించడంతో తండావాసులకు తెలిపాడు. కుమారుడు గుగులోతు పరమేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్థల పరిశీలన చేసిన రజక సంఘం నేతలు

జనగామ రూరల్, సెప్టెంబరు 25: చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని ఈనెల 26న నిర్వహించే వేడుకలకుగాను రజక సంఘం నాయకులు బుధవారం స్థల పరిశీలన చేశారు. ఐలమ్మ 129వ జయంతి వేడుకలు జనగామలోని గడిబజారు మీ సేవా కేంద్రం వద్ద నిర్వహించనుండగా ఆ సంఘం నాయకులు స్థలాన్ని పరిశీలించి ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జనగామ, నర్మెట, తరిగొప్పుల, బచ్చన్నపేట మండలాల నుంచి రజక బంధువులు, తెలంగాణ ఉద్యమకారులు, పురప్రముఖులు హాజరవుతారన్నారు. అనంతరం సహపంక్తి భోజనం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఉల్లెంగుల కృష్ణ, నర్సయ్య శ్రీను, రాజు, సారయ్య, నర్సింహులు, సత్యనారాయణ, రామకృష్ణ, శ్రీను, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో సత్తా చాటుదాం

▸▸ మహిళా కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మౌనిక

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 25: మహిళా కాంగ్రెస్ ఆన్‌లైన్ సభ్యత్వ నమోదులో ఘన్‌పూర్ నియోజకవర్గ మహిళా నాయకులు సత్తా చాటాల్సిన అవసరం ఉందని మహిళా కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి వద్లూరి మౌనిక అన్నారు. బుధవారం డివిజన్ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆన్‌లైన్ సభ్యత్వ నమోదును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్న పార్టీ కాంగ్రెస్ అన్నారు. బీజేపీ అరాచక పాలనను చూసి మహిళలు పెద్ద ఎత్తున కాంగ్రెస్‌లో సభ్యత్వం తీసుకుంటున్నారని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు సమాన న్యాయం కల్పిస్తున్న పార్టీ కాంగ్రెస్ అన్నారు. జిల్లాలోనే ఘన్‌పూర్ నియోజకవర్గంనుంచి ఎక్కువ మొత్తంలో సభ్యత్వ నమోదులను చేపట్టి సత్తా చాటాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు గాజుల రజని, లక్ష్మి, వివిధ మండలాల మహిళా అధ్యక్షులు చింత జోత్స్న, మోతె యామిని, శోభ, ఘన్‌పూర్ మండల ప్రధాన కార్యదర్శి నారగోని పద్మ, తాడగోని సుప్రియ, కొంతం కొమురమ్మ, నారగోని సరిత, కొయ్యడ గట్టమ్మ, గడ్డం స్వరూప పాల్గొన్నారు.



ఆన్‌లైన్ సభ్యత్వ నమోదును చూపుతున్న మహిళా కాంగ్రెస్ నేతలు

బాలికలకు కౌన్సెలింగ్

జనగామ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రిహాబిలిటేషన్ సెంటర్ నుంచి పారిపోయి వచ్చిన ఇద్దరు బాలికలకు జనగామ పోలీసులు బుధవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు బాలికలను పలు కారణాలతో వారి కుటుంబ సభ్యులు రిహాబిలిటేషన్ సెంటర్‌లో చేర్పించారు. అక్కడ ఉండడం ఇష్టంలేని వారు పారిపోయి బుధవారం జనగామకు చేరుకున్నారు. ఆ ఇద్దరిలో ఓ బాలిక వద్ద ఉన్న ఫోన్ సిగ్నల్ ఆధారంగా జనగామలో ఉన్నట్లు గుర్తించిన హైదరాబాద్ పోలీసులు ఇక్కడి పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో మహిళా ఎస్సై శ్వేత వారిని అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చి.. తల్లిదండ్రులను పిలిపించి వారికి అప్పగించారు.

పోలీసులకు బెస్ట్ సిటిజన్ సర్వీస్ అవార్డులు

వరంగల్ క్రైం, సెప్టెంబరు 25: ప్రజలకు మెరుగైన సేవలు అందించిన ఆత్మకూరు, చిల్పూర్ పోలీసులు డీజీపీ జితేందర్ చేతుల మీదుగా బెస్ట్ సిటిజన్ సర్వీస్ అవార్డును అందుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు అందిస్తున్న సేవలతో పాటు విధి నిర్వహణలో ప్రతిభ ఆధారంగా ప్రతీ నెల రాష్ట్రంలో ఎంపికైన పోలీస్ స్టేషన్‌లకు అవార్డులు అందిస్తుంటారు. అందులో భాగంగా బుధవారం డీజీపీ చేతుల మీదుగా ఆత్మకూరు, చిల్పూర్ సీఐలు సంతోష్, రాజేందర్‌లు అవార్డులు అందుకున్నారు. అవార్డు అందుకున్న సీఐలను సీపీ అంబర్ కిషోర్ ఝా అభినందించారు.

మట్టి అక్రమ తరలింపుపై దృష్టి సారించండి

చిలుపూర్, సెప్టెంబరు 25: మండలంలో మట్టి అక్రమ తరలింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా మైనింగ్ ఏడీ డాక్టర్ గుర్రం విజయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం వివిధ శాఖలకు చెందిన అధికారులతో కలిసి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ మండలంలోని నష్కల్ రెవెన్యూ పరిధిలోని ఏనెలో నిత్యం తవ్వకాలు చేపట్టి లారీల ద్వారా మట్టిని తరలిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. సహజ వనరులను కాపాడుకోవడంలో భాగంగా ప్రతి ఒక్కరూ తమవంతుగా సహకరించాలని స్పష్ట చేశారు. మట్టి అక్రమ తరలింపుపై మండల స్థాయి అధికారులతో పాటు పోలీసులు దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో బర్మావత్ శంకర్, తహసీల్దార్ సరస్వతి, ఎంపీవో శ్రీపాద మధుసూదన్, ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్, ఎమ్మార్ఐ కలువల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించేలా తర్ఫీదు ఇవ్వాలి

▸▸ డీఐఈవో జితేందర్ రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 25: ఇంటర్‌లో మెరుగైన ఫలితాలు సాధించేలా విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వాలని డీఐఈవో జితేందర్ రెడ్డి తెలిపారు. బుధవారం శివునిపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధ్యాపకుల రిజిస్టర్లను, విద్యార్థుల అటెండెన్స్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం అధ్యాపకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు సూచనలు చేశారు. గత ఏడాది కంటే ఇంటర్‌లో ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరిగేలా విద్యార్థులకు సబ్జెకుల వారీగా బోధన నిర్వహించాలని సూచించారు. ప్రతీ రోజు ఉదయం 9 నుంచి 10గంటల వరకు, సాయంత్రం 4నుంచి 5గంటల వరకు స్టడీ అవర్స్ తీసుకొని విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. ప్రతీ విద్యార్థి కదలికపై అధ్యాపకులు దృష్టి సారించి సక్రమంగా చదివేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జి.కమలాకర్, సాంబమూర్తి, జి.నవీన్, కరుణాకర్, సీహెచ్.లావణ్య, మోహన్, శ్వేత, సునీత, సౌభాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో లోపాలను నివారించాలి

▸▸ డివిజనల్ పంచాయతీ అధికారి వెంకట్‌రెడ్డి

జఫర్‌గఢ్, సెప్టెంబరు 25 : గ్రామాల్లో తాగునీటి సరఫరాలో తలెత్తే చిన్నచిన్న లోపాలను నివారిస్తూ.. ప్రజలకు సక్రమంగా నీటిని అందించుటలో శిక్షకులు భాగస్వాములు కావాలని డివిజనల్ పంచాయతీ అధికారి వెంకట్‌రెడ్డి అన్నారు. జఫర్‌గఢ్ మండల పరిషత్ కార్యాలయంలో రక్షిత మంచినీటి పథకం, మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో ఎంపిక చేయబడిన తాగునీటి సహాయకులకు శిక్షణ సమావేశాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ తాగునీటి సరఫరా, లీకేజీల నివారణ, మరమ్మతులు తదితర అంశాలపై నాలుగు రోజుల పాటు శిక్షణ ఇస్తారన్నారు. గ్రామాల్లోని ఆయా వీధుల్లో పైపులైన్ల లీకేజీ, చిన్నచిన్న విద్యుత్ సమస్యలు, మరమ్మతులపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలన్నారు. నిపుణత సాధించిన వారిని ప్రభుత్వం గుర్తిస్తుందన్నారు. ఎంపీడీవో సుమన్, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ కరణ్‌కుమార్, ఏఈ సుకన్య, లింగమూర్తి పాల్గొన్నారు.



జఫర్‌గఢ్‌లో మాట్లాడుతున్న డీఎల్‌పీవో వెంకట్‌రెడ్డి

తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలి

చిలుపూర్: తాగునీటి సమస్యకు సత్వర పరిష్కారం చూపడమే లక్ష్యంగా గ్రామ మంచినీటి సహాయకులు పని చేయాలని డీపీవో స్వరూపరాణి అన్నారు. మండలంలోని చిన్నపెండ్యాల జీపీ కార్యాలయంలో బోర్‌వెల్స్, చేతిపంపులు, ఎలక్ట్రిక్ స్టార్టర్ల రిపేరింగ్ తదితరాలకు సంబంధించి నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ శిబిరాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా డీపీవో స్వరూపరాణి మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలన్న లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం మంచినీటి సహాయకులకు నాలుగు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం చేపట్టిందన్నారు. నిష్ణాతులైన మెకానిక్‌లచే మంచినీటి సహాయకుల(వాటర్‌మెన్లు)కు శిక్షణను ఇప్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ రాజయ్య, డీఈఈలు సూర్య రాజు, ఎంపీవో శ్రీపాద మధుసూదన్, ఏఈ లక్ష్మిపతి, పంచాయతీ సెక్రటరీ శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన శ్రీరాములు



స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 25 : టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను హైదరాబాద్‌లోని నివాసంలో స్టేషన్‌ఘన్‌పూర్ బ్లాక్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ నాగరబోయిన శ్రీరాములు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఘన్‌పూర్ బ్లాక్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి, ప్రభుత్వ పథకాల అమలును మహేష్‌కుమార్ అడిగి తెలుసుకున్నట్లు శ్రీరాములు చెప్పారు.

ఘనంగా పోషణ మాసం

కొడకండ్ల, సెప్టెంబరు 25: మండల కేంద్రంలోని అన్ని అంగన్‌వాడీ సెంటర్ల టీచర్లు కలిసి బుధవారం ఘనంగా పోషణ మాసం నిర్వహించారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలోని డాక్టర్ వర్షిణి ఆధ్వర్యంలో వైద్య బృందం అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లల ఎత్తు, బరువును కొలిచి, రోగనిరోధకశక్తి, రక్తహీనత తదితర ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. సరళ, ఎంపీవో ఇందిర, వైద్యసిబ్బంది రమేశ్, టీచర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రీన్‌డే వేడుకలు

జనగామ కల్చరల్, సెప్టెంబరు 25: జనగామ జిల్లా కేంద్రంలోని వడ్డెరవాడ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గ్రీన్‌డే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీవో రమాదేవి, సూపర్‌వైజర్ పూర్ణిమ, టీచర్ రాములమ్మ, తల్లులు, బాలబాలికలు పాల్గొన్నారు.

నేడు పాడి రైతుల ధర్నా

జనగామ కల్చరల్, సెప్టెంబరు 25: రాష్ట్రంలో పాడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ పాల ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 26న ధర్నాను జయప్రదం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందు నాయక్ పిలుపునిచ్చారు. జనగామ జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు బిల్లులు చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, లీటరకు రూ.5 ప్రోత్సాహకం ఎన్నికల హామీని అమలు చేయాలన్నారు. పాడి సంరక్షణ మందులు, గడ్డి విత్తనాలు 50 శాతం సబ్సిడీపై అందించాలన్నారు. సమస్యల పరిష్కారానికి ఈనెల 26న హైదరాబాద్‌లోని ధర్నాచౌక్ వద్ద జరిగే ధర్నాను పాడి రైతులు జయప్రదం చేయాలని ఆయన కోరారు.

పేదల సంక్షేమం పట్టని బీజేపీ సర్కార్ : సీపీఎం

జఫర్‌గఢ్, సెప్టెంబరు 25: పేదల సమస్యలు, వారి సంక్షేమాన్ని కేంద్రంలోని బీజేపీ సర్కార్ పట్టించుకోవడం లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ.అబ్బాస్, జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తమ్మడపల్లి(జి)లో సీపీఎం మహాసభ వడ్లకొండ సుధాకర్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన అబ్బాస్, కనకారెడ్డి మాట్లాడుతూ కూడు, గుడ్డ లేక పేదలు అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నిత్యావసర ధరలు నానాటికి విపరీతంగా పెరుగుతుండడంతో కొనుగోలు శక్తి తగ్గి సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు దుర్భర జీవితాలు గడుపుతున్నారని తెలిపారు. ధరల నియంత్రణలో కేంద్రం పూర్తిగా విఫలమైందన్నారు. పేదల కష్టాలు పట్టించుకోకుండా ప్రధాని మోదీ సర్కార్.. కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ దేశ సంపదను దోచి పెడుతున్నారన్నారు. స్విస్ బ్యాంకులోని నల్లధనాన్ని బయటకు తీసి పేదల జన్‌ధన్ ఖాతాల్లో రూ.15 లక్షలు చొప్పున జమ చేస్తానన్న మోదీ హామీ ఏమైందని ప్రశ్నించారు. స్వాతంత్ర్యం సిద్ధించి ఏడు దశాబ్దాలు దాటినా పేదవాడికి సొంతిల్లు లేకపోవడం పాలకులకు పేదల పట్ల ఉన్న చిత్తశుద్ధి ఏమిటో స్పష్టమవుతోందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు దాటుతున్నా పేదోడి సొంతింటి కల కలగానే మిగిలిపోతోందన్నారు. మహాసభకు ముందు పార్టీ శ్రేణులు, అనుబంధ సంఘాలు గ్రామంలో భారీర్యాలీ నిర్వహించారు. కాగా,మహాసభలో సీపీఎం తమ్మడపల్లి(జి) గ్రామ కార్యదర్శిగా వడ్లకొండ సుధాకర్, శాఖ కార్యదర్శులుగా వేల్పుల పెద్దరాములు, చిలువేరు మల్లేశ్, ముక్కెర రాజు, మహిళా కార్యదర్శులుగా రాపర్తి రజిత, గుర్రపు శృతి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. సభలో సీపీఎం జిల్లా నేతలు రాపర్తి రాజు, చందు నాయక్, మండల కార్యదర్శి రాపర్తి సోమయ్య, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అహల్య, కార్యదర్శి ఎండి.షబానా, పార్టీ నాయకుల పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న సీపీఎం నేతలు అబ్బాస్, కనకారెడ్డి, కార్యకర్తలు

పత్తి, వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

▸▸ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ అనిల్‌కుమార్

నర్మెట, సెప్టెంబరు 25: పత్తి, వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏరువాక కేంద్రం భువనగిరి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ అనిల్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో వరి, పత్తి పంటలను పరిశీలించారు. పత్తిలో బ్యాక్టీరియా నల్ల మచ్చ తెగులు, కాయ కుళ్ల తెగులు, పూత, గూడ రాలడం గమనించినట్లు అధికారులు తెలిపారు. వాటి నివారణకు ఎకరానికి 20 గ్రాములు స్ట్రెప్టోసైక్లిన్, కాపర్ ఆక్సీక్లోరైడ్ 600 గ్రాములు కలిపి పిచికారి చేయాలన్నారు. పూత, గూడ రాలకుండా కాయ ఎదుగుదలకు ఎకరానికి 2కిలోల 13.0.45 పిచికారి చేయాలన్నారు. వరిలో కాండం తొలుచు పురుగు నివారణకు ఎకరానికి 400 గ్రాముల కార్టప్ హైడ్రోక్లోరైడ్, క్లోరాన్‌ట్రిపోల్‌ను పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో జనగామ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్ఎస్ బీనా, మండల వ్యవసాయ అధికారి డి.సంతోషి, వ్యవసాయ విస్తరణ అధికారి సుంకరి జగదీష్, రైతులు హన్మరెడ్డి, గణేష్, లింగారెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

- తరిగొప్పుల: అధిక వర్షాలను తట్టుకునేందుకు రైతులు వరి, పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని శాస్త్రవేత్త అనిల్‌కమార్ అన్నారు. జనగామ ఏడీఏ బీనా, మండల వ్యవసాయాధికారి సంతోషతో కలిసి ఆయన మండల కేంద్రంతో పాటు అంకుషాపూర్ క్లస్టర్లలో పర్యటించి పత్తి, వరి పంటలను పరిశీలించారు. సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో విస్తరణ అధికారులు రేష్మ, ప్రశాంత్ పాల్గొన్నారు.

'నన్ను ఇన్‌చార్జ్ చైర్మన్‌గా నియమించండి'

రఘునాథపల్లి, సెప్టెంబరు 25: మండలంలోని కంచనపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఇన్‌చార్జ్ చైర్మన్‌గా నియమించాలని కోరుతూ సొసైటీ వైస్ చైర్మన్ మూడు ధర్మ బుధవారం డీసీవో రాజేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధర్మ మాట్లాడుతూ తనపై వైస్ చైర్మన్‌గా అనర్హత వేటు వేయడం సరికాదని హైకోర్టును ఆశ్రయించగా, యథావిధిగా కొనసాగేటట్లు హైకోర్టు స్టే మంజూరు చేసిందని అన్నారు. సొసైటీ నిధులను దుర్వినియోగం చేశాడని పీఏసీఎస్ చైర్మన్ రవిందర్‌ను డీసీవో సస్పెండ్ చేసినందున, సొసైటీ ఇన్‌చార్జ్ చైర్మన్‌గా తనను నియమించాలని వైస్ చైర్మన్ మూడు ధర్మ డీసీవో రాజేందర్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంఈవోలు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, సెప్టెంబరు 25 : స్టేషన్‌ఘన్‌పూర్ ఎంఎస్‌వోగా ఉన్న జి.కొమురయ్య మండల విద్యాశాఖాధికారిగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయనను కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ఎం.సంపత్, కె.రమేశ్, రఘూజీ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు జి.ప్రమోద్‌రెడ్డి, వంగ రఘు, చిక్కుడు శ్రీనివాస్, ఎం.పూర్ణచందర్, రాము, వై.రమేశ్, మోహన్, శ్రీధర్, ప్రవీణ్ కుమార్, ఎంఆర్‌సీ సిబ్బంది గిరి, సునిత, జ్యోతి, ప్రవీన్, వెంకటేశ్వర్లు, రామతులసి, శ్రీలత, రమేశ్ తదితరులు కలుసుకుని శాలువాలు కప్పి అభినందించారు.

- దేవరుప్పుల: దేవరుప్పుల మండల విద్యాశాఖాధికారిగా గుంటిపల్లి కళావతి బుధవారం మండల మానవ వనరుల కేంద్రంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. కళావతి గత కొన్ని నెలలుగా ఇదే మండలంలో నోడల్ అధికారిగా పని చేస్తున్నారు. ప్రభుత్వం ఆమెకు ఫుల్ అడిషనల్ చార్జ్ ఇవ్వడంతో ఎంఈవోగా బాధ్యతలు చేపట్టారు.
- కొడకండ్ల: ఉపాధ్యాయుల పదోన్నతుల్లో భాగంగా మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న గ్రేస్ కేజియా రాణి కొడకండ్ల మండల విద్యాధికారిగా పదోన్నతి పొందారు. ఈ మేరకు స్థానిక మండల విద్యావనరుల కార్యాలయంలో బుధవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఆమెను మండల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు, ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పి.వెంకటాద్రి, చంద్రయ్య అందె సుధాకర్, బాలాజి, యాకయ్య పాల్గొన్నారు.
- తరిగొప్పుల: మండల విద్యాధికారిగా జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నెల్లుట్ల జానకి బుధవారం మండల విద్యావనరుల కేంద్రంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల సమస్యలు పరిష్కరించే దిశగా పని చేస్తానన్నారు. అనంతరం ఉపాధ్యాయులు ఎంఈవో జానకిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- జఫర్‌గఢ్: మండల నూతన విద్యాశాఖాధికారిగా ఎండి.పర్వేజ్ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. కూనూరు జడ్పీ హైస్కూల్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆయన రెగ్యులర్ ఎంఈవోగా నియమితులయ్యారు. దీంతో ఆయన స్థానిక ఎమ్మార్సీ భవనంలో ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయుల సమక్షంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో పర్వేజ్‌ను శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్ష కార్యదర్శులు సీతారామయ్య, రామారావు, అసోసియేట్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రతినిధులు సదానందం, పెద్దిరెడ్డి, ఉపాధ్యాయులు, సీఆర్పీ పుట్ట స్వామి, ఐఈఆర్‌డీ దుస్స లక్ష్మణ్, మామిడాల శివకృష్ణ, ఎంఆర్‌సీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.